# భక్తి

మనమందరము ఏళ్లతరబడి సాధన చేసి వున్నాము. భక్తికి పూర్వమున్న స్థాయిల గురించిన అవగాహనయే లేకుండిన యెడల మీకు భక్తికి సంబంధించిన అవగాహన బొత్తిగా వుండబోదు. ఆ స్థాయిలు ఏమై వుంటాయి. ఆ దివ్యత్వము సర్వత్రానున్నదని, భక్తి భావన పెంపొందటానికి యీ అవగాహన ప్రధానమైనదన్న అంశాన్ని వివేకమును గురించి మనము చర్చించినప్పుడు ప్రస్తావించాము. ఆయన కేవలము సర్వవ్యాపి మాత్రమే కాదు, యిచ్చటనున్న ప్రతిదీ ఆయన సొంతమని కూడా మనకు తెలుసు. నీ సొంతమంటూ ఏదియును లేదు, ప్రతిదీ ఆయన సొంతమైయున్నది. ఆయన తప్ప వేరే ఏ వస్తువుపట్ల అనురాగము వుండజాలదన్న స్థితికి దారితీస్తుంది. అదియే వైరాగ్యము, యిది భక్తి కలగటానికి ముందు మరో మెట్టు. భగవంతునికి మరియు ప్రకృతికి మధ్యన అవినాభావ సంబంధముందని, అవి రెండూ ఒకదానిపై మరొకటి ఆధారపడి యున్నాయన్న విషయము కూడా మన అవగాహనకు వచ్చును. మనము ప్రకృతిలో వొక భాగమై వున్నాము. ఒకటి మరొక దానిపై ఆధారపడియున్నది. ప్రకృతి పురుషుడు ఒకరిపై మరొకరు ఆధారపడియున్నారు. ఒకరు లేనిదే మరొకరి వునికే లేదు. అప్పుడు గమ్యమును చేరాలన్న ఒక తపన లేదా ఆరాటము అచ్చట వుండి తీరాలి, అప్పుడే మనకు భక్తి భావన ఏర్పడుతుంది. తపనే భక్తికి నాంది. మన పుస్తకములలో తపనను మనము మూడవ గ్రంథిలోనున్నట్లు పేర్కొన్నాము. వాస్తవానికి ఆ స్థితి అంతకు మునుపే వస్తుంది. ఇప్పుడు భక్తికి సంబంధించిన అనేక అంశాలపై విశదీకరించెదను. అవి నడుమనగల బిందువులని (buffer points) తెలియనగును. రెండు, మూడవ గ్రంథుల మధ్యన విశాలమైన యెడము వున్నది. అది ఏటవాలుగా పైకి పోవును. వీటికి సంబంధించిన ప్రాథమిక విషయములు తెలిసినంతనే ఒకడు భక్తుడైపోడు, అతనిని పలుమార్లు పైకి నెట్టబడవలసిన అవసరమెంతేని వున్నది. దీనికి గల కారణమును తదుపరి విశదీకరించెదను. ఈ ఐదు మౌలిక అంశములు మనము కలిగి వున్నప్పుడు, అది మనలను ఊర్ధ్వ చేతనమునకు గొనిపోబడు శక్తినిచ్చును. అంతవరకు మనము ఊర్ధ్వ చేతనమునకు కొనిపోబడుదుమన్న మాట వట్టిదే. అది అంత తేలికైన పనికాదు. అతడు వీటిని గురించి తెలుసుకోవాలి, వాటిని అనుభూతి చెందాలి. మొదటి, రెండు గ్రంథులలోని యాత్ర పూర్తి చేసినప్పుడే ఆ ప్రాణ ప్రసారము ఊర్ధ్వ భాగము వైపునకు వెళ్ళుచున్నదని చెప్పగలవు. అతడు అధిచేతనుడగుటకు ప్రయత్నిస్తున్నాడని, తనకు అతీతమైనదొకటున్నదన్న విషయాన్ని తెలుసుకొనడానికి ప్రయత్నిస్తున్నాడని చెప్పవచ్చు. భక్తి కేంద్రమునందు, "Path of Grace" పుస్తకములో పేర్కొనియున్నట్లు, మనము దివ్యత్వము పట్ల తదేకధ్యాసలో వుంటాము. అది కూడ లక్ష్యముపట్ల స్పష్టతను పెంపొందించుకొనుటలో మనకు ఎంతో తోడ్పడుతుంది. నిజానికి ఈ

రెండు సిద్ధాంతాలు వొకదానిలో నొకటి ముడిపడి వున్నాయి. లక్ష్యము పట్ల స్పష్టత లేనిదే నీవు తదేక ధ్యాసపరుడవు కాలేవు. అట్లు కానిచో నీకు లక్ష్యము పట్ల స్పష్టత కుదరదు. అది వొక విషవలయము. అనేక కారణాల వల్ల మనము అందులో చిక్కుకు పోతుంటాము. తొలుత యిచ్చట మనకున్నదల్లా ఉద్వేగపూరితమైన భక్తి అనవచ్చు. అది క్రమముగా మన చిత్రపటము(chart)లో చూపినట్లు గురుచిత్త అవలంబనముగా మారుతుంది. అనగా గురువర్యుల చేతనమును నీదగు చేతనముగా మార్చుకొనెడి ప్రయత్నము. ఇచ్చట మనము పిండదేశములోని ఒక బిందువు వద్ద వున్నాము. అచ్చట అంతా ఉద్వేగ భరితమే. ఇందులకు గల కారణము అది భూమి, నీరు తత్త్వాలకు సంబంధించి యున్నది కనుక. మరి అచట కాల్చబడునది కట్టె, మనము పచ్చ భాస్వరము కాల్చబడెడి స్థితికి యింకనూ చేరుకొని యుండలేదు, అది ముందు ముందు తటస్థిస్తుంది, ప్రస్తుతానికి ఇవన్నీ ఊహకందని విషయాలు. మనకున్న భక్తిని గురించి వీలైనంత మేరకు నేను విశ్లేష ప్రయత్నించాను. అది రెండు విషయాలపై ఆధారపడి యున్నది: నీ లక్ష్యమేమై యున్నది, నీవు ఏ కోవకు చెందిన వాడవు, అసలు లక్ష్యమేది. మనము ఆధ్యాత్మిక భక్తిని కలిగి వుండవచ్చు, ఆధి భౌతిక భక్తి, ఆధి దైవిక భక్తి కలిగి వుండవచ్చు. ఇక ఆత్మ జ్ఞాన విషయానికొస్తే మన గురువర్యులు దానిని గురించి "Reality at Dawn"లో యిదివరకే ప్రస్తావించి యున్నారు, నీకు ఆధ్యాత్మికమునకు సంబంధించి భక్తి, జ్ఞాన, కర్మలు వున్నాయి. ఐతే మన సమస్య అది కాదు. మన సమస్య బొత్తిగా దీనికి భిన్న మై వున్నది. స్వభావ రీత్యా మనలో కొందరు దైవీప్రవృత్తిని కలిగి యున్నారు, అలాగే కొందరు అసురీ ప్రవృత్తుని కలిగి యున్నారు. అసురులు కూడ భక్తిని పొందగలుగు సామర్థ్యమును కలిగియున్నారు. వారు ఎందరో సాత్వికులకన్నను మిన్న యైన సామర్థ్యమును భక్తిని పొందుటలో ప్రదర్శించి యున్నారు. అచ్చట దైవీ భక్తి మరియు ఆసురీ భక్తియని రెండు రకాలున్నాయి. రాక్షస భక్తి అన్నింటిని తమ స్వాధీనములో వుండాలన్న కాంక్షతో కూడినది, ఎంత దొరకపుచ్చుకోగలిగితే అంత అన్నమాట. భగవంతుని సమీపించి ఏదైనా వరమియ్యమని అడుగువాడు దాదాపు రాక్షసునికిందే లెక్క. అలాగే భగవంతుని సమీపించి ఆయననేవిధముగ సేవించగలనని కోరువాడు దివ్య స్వరూపుడే. ఈ రెంటిలో నీవు యేకోవకు చెందిన వాడవు, ఖచ్చితముగ నీవు ఏమి కాంక్షించుచున్నావు. భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు గుణత్రయ విభాగయోగములో పేర్కొన్నట్లు మనల్ని మనము గుణమును బట్టి సాత్వికులుగాను, రాజసికులుగాను, తామసికులుగాను విభజించుకొనగలము. సాత్విక భక్తి విధానము రాజసిక భక్తి విధానము కంటె భిన్న మైనది, అలాగే రాజసిక భక్తి విధానము తామసిక భక్తి విధానముకన్న బొత్తిగా వేరుపడియున్నది. మనకు అందుబాటులోనున్న సాహిత్యము మరియు వృత్తాంతము మేరకు భక్త కన్నప్పది తామసిక భక్తియనియే చెప్పవచ్చును. కర్మ, యజ్ఞ యాగాదులు లేదా పూజలు సల్పెడి ఎక్కువ శాతము ప్రజలు రాజసికులే. ధ్యానము చేయు ప్రజలు సాత్వికులు. ఈ విషయాన్ని శ్రీ కృష్ణభగవానుడు

భగవద్గీతలో చాలా చక్కగా వివరించి యున్నాడు. ఆయన యీ విధముగా విభజించి యున్నాడు. నన్ను ధ్యానించు వాడు నన్నే చేరును. ఇక యజ్ఞములు చేసెడి వారు వారి యోగ్యత మేరకు కర్మానుసారము మరల జన్మనెత్తి నన్ను చేరెదరు. వారు చంద్ర మార్గములో (Path of Raye) పయనించెదరు తప్ప సూర్య మార్గము (Path of Sun Archis) ద్వారా కాదు.

నీవు ప్రకటించెడి భక్తి నీవు అంతర్ముఖుడవా లేదా బాహ్య విషయ అనురక్తుడవా అన్నదానిపై ఆధారపడియున్నది. మానసిక ఆరాధన బాహ్యాడంబర భక్తికన్న భిన్నమైనది. బాహ్యాడంబర భక్తిలో నీవు ఒక వైవిధ్యముగల దుస్తులు ధరించి, మాలను వేసుకొని, బహుశః ఒక తంబూరాను చేతబూని గీతాలాపన చేస్తూ భక్తునిలా చెలామణి అవుటకు ప్రయత్నిస్తావు. అదే ఆంతరిక భక్తిలో నీవట్లు చేయవు. ఇంటిలోని ఒక మూలన కూర్చుని, కొన్ని స్తోత్రములు పఠించవలసి వచ్చినను నీవు భగవంతుని స్మరిస్తావు, అంతేకాని వెలుపలికి రావు. నీకు సాంఘిక గుర్తింపు కావాలా లేదా దానిని గురించి నీవు పట్టించుకొనటము లేదా.

మన భక్తి పురుషార్థములపై నాధారపడి వేర్వేరుగానున్నది. పురుషార్థములు నాలుగు. అవి అర్థము, కామము, ధర్మము మరియు మోక్షము. ఒక అర్థార్థి భక్తి కామార్థి భక్తికి బొత్తిగా భిన్నమైవున్నది. మరి కామార్థి భక్తి ధర్మార్థి భక్తికి బొత్తిగా భిన్నమైవున్నది. మరి ధర్మార్థి భక్తి మోక్షార్థి భక్తికి పూర్తిగా వేరుపడియున్నది. నీవు ఏ భక్తిని అనుసరిస్తున్నావు, నీవు ఏమి కోరుచున్నావు. ధనమా, కీర్తి ప్రతిష్ఠలా లేదా సుఖాలా లేదా వీటన్నింటినుండి నిన్ను బంధవిముక్తుడిని గావించెడి భగవంతుని శరణుజొచ్చుటకు నీవు సిద్ధమేనా. ఈ ముఖ్యమైన ప్రశ్న నీవు నీకై వేసుకోవలసినది. జీవితములోని వేర్వేరు స్థాయిలలో మనకు విభిన్న అవసరాలు వుంటాయి, సాంఘిక అవసరాలు, వ్యక్తిగతమైనవి, కొన్నివేళలందు నీకు తప్పనిసరిగ కొంత డబ్బు సంపాదించవలసి వస్తుంది. ఆ ఆకర్షణకు మనము లొంగెదమా లేదా మనము లక్ష్య స్పష్టత కలిగివుంటామా. వీటిని పట్టించుకోకపోవటము మనకు సాధ్యమేనా. మాటవరసకు నీవు కీర్తిని కాంక్షిస్తున్నావనుకుందాము, అనగా ధర్మకీర్తి, అది కాంక్షించటములో ఏ తప్పిదము లేదు. శిబి చక్రవర్తి అటుల కాంక్షించినాడు, బలిచక్రవర్తి సైతము అలాగే చేశాడు, మనమెందులకు అట్లు కాంక్షించరాదు. నీవు ఆ ధర్మార్థి ఆకర్షణకు లొంగినచో, ఆ ధర్మార్థి కోవకు చెందిన భక్తి మోక్షార్థి కోవకు చెందిన భక్తికన్నా భిన్నమైనది. మన పద్ధతిలో ముక్తిని గురించి మనము ప్రస్తావిస్తున్నాము. ఆ గురువర్యులతో ఏకత్వము చెందెడి విషయమై మనము మాట్లాడుతున్నాము. ఇచ్చట అర్థ, కామ లేదా ధర్మమును గురించిన ప్రసక్తే లేదు. అవి సుతరాము భిన్నమైనవి. మనము ఆధి భౌతిక అంశమునుండి వెలుపలికి వచ్చామని చెప్పినప్పుడు, మరి దాని ఆధి దైవిక అంశమును గురించి మాట్లాడుతున్నామని అన్నప్పుడు,

మనము అత్యంత అధ్వాన్నకరమైన సమస్యను కలిగివున్నట్లే. భారతదేశములో మనకున్న మౌలిక సమస్య ఇదియే. మనము అశాశ్వతుడైన భగవంతుని గురించి మాట్లాడుతున్నామా లేదా ఒక అందుబాటులోనున్న దేవుని గురించి మాట్లాడుతున్నామా. మనము మాట్లాడుతున్నది ఆ పరమాత్మ గురించా లేదా అంతర్యామి గురించా. ఎట్లకేలకు ఒకే భగవానుడు రెండు స్థలాలలోను తనను ప్రదర్శించుకుంటున్నాడు, ఐతే మార్గము పూర్తిగా భిన్న మై యున్నది లేదా నుదుటి భాగమున విభూతిని పులుముకున్న దేవుడిని గురించా, అనగా అనేక అవతారాలు లేదా జగత్‌ను పోషించువాడగు భగవానుని వెదకుచుంటివా. ఏ భగవానుని కోరుచున్నావు. ఏ భగవానుని పట్ల భక్తి కలిగి యున్నావు. నీకు ఖచ్చితముగా కావలసినదేమి. ఇది అమూర్తి భావన కన్న కొద్దిగా భిన్న మైనది. అమూర్తి భావనలో మూర్తికి మారుగ ఒక విశ్వజనీన సిద్ధాంతము క్రియాశీలమైయుంటుంది. అది పరాతీత స్థాయి కాదు. అమూర్తి భావన అనగా నాపైనున్న ఒక శక్తి విశ్వాన్ని నియంత్రిస్తున్నది, సమవర్తి సిద్ధాంతము, మనము దానిపట్ల భక్తిని కలిగియున్నామా లేదా ఆ మూర్తిని కలిగియున్నామా. ఆ మూర్తి నీ రక్షకుడు, నీ ముక్తిదాత, నీకు వలయుననీ్న చేసిపెట్టెడివాడు. ఈ సమస్యను నీవు పరికించిన యెడల మన పద్ధతిమేరకు నీవు సందిగ్ధములోనున్నట్లు నీకు అవగతమవుతుంది. పూజ్య బాబూజీ ఒక మూర్తి కూడా మరియు ఒక రక్షకుడు, ముక్తి ప్రదాత, మరియు భావాతీత శూన్యత్వము, మన లక్ష్యము. దీనివైపే మనము పయనిస్తున్నాము. ఏ భక్తిని కలిగియున్నావు. మీరందరు ఎంతో కాలమునుండి ధ్యానము చేయుచున్నారు, కనుక జవాబుల కన్న ప్రశ్నలే నేనెక్కువగా వేయుచున్నాను. ఏ మూర్తి లేదా ఏ అమూర్తిని మీరు పొంద ప్రయత్నిస్తున్నారు, ఆ మూడు పురుషార్థాలను గురించిన స్పష్టత మీకున్నదా, మరి వాటితో మాకు పన్లేదు, మాకు మోక్షమొక్కటే చాలనుకుంటున్నారా. మీకు వీటిపట్ల స్పష్టత వున్నదా. మీ భక్తి కేవలము దీనిపై ఆధారపడి యుంటుంది. భక్తియొక్క పరిపక్వత దీనిపై ఆధారపడియుంటుంది. ఈ భావనలన్నింటితో తదేక ధ్యాసను సాధించుట అసాధ్యము. మనము తదేక ధ్యాసను దివ్యత్వము పట్ల తప్పక కలిగి వుండవలెనని యిదివరకే చెప్పియున్నాము. ఎన్నో సిద్ధాంతాలు మనల్ని చుట్టుముట్టి యుండగా మనము దీనినెలా సాధింపగలము. మీరెలా నెట్టుకొస్తున్నారు? అది చాలా కఠినము. నా ప్రశ్న చాలా కఠినతరమైనది మరి యీ దిశలో ఈ ప్రశ్నపట్ల మీకు అవగాహన యుండినదా. ప్రతియొక్కడూ తాను గురువర్యులకు అంకితమై యున్నానని చెబుతాడు, ఏవిధంగా?

అచ్చట నవ (తొమ్మిది) రసాలు, ఉద్వేగాలు వున్నాయి. అవి శాంత, హాస్య, వాత్సల్య, అద్భుత, మాధుర్య, శోక, క్రోధ, విరహ మరియు విస్మయ రసాలు. ఇవి మనకు భగవంతుని పట్ల వున్నటువంటి తొమ్మిది మౌలిక భావనలు. ఆశ్చర్యము (విస్మయము) - కేంద్ర ప్రాంతమునందు వున్నపుడు నీకు కలుగు భావమిదియే. అదియేమని నీవు అవాక్కయి పోతావు. తనను

శిక్షించగల వ్య క్తి భగవంతుడేనని పలువురు ఆలోచింపగలరు, బహుశః క్రోధము అదియేనేమో. తాను మనోవ్యధకు గురయ్యానని భగవంతుడు మరియు గురువర్యులు రోదించినప్పుడు, మీలో ఎంతమంది అది భగవంతుని శోక రసమని భావించారు. భగవంతుడు విలపించుచున్నాడు, ఒక మనిషి తాను మనోవ్యధకు గురయ్యానని అన్నప్పుడు, భగవంతుడు రోదిస్తున్నాడు మరి గురువర్యులు అతను వాస్తవముగ విలపిస్తున్నాడని చెబుతున్నప్పుడు నీవు దానికి స్పందించావా. అతని కన్నీళ్ళు కొంతైనా తుడవటానికి ఒక రుమాలుకై ఆలోచింపగలవా. నీవు ఆలోచిస్తూ వచ్చిన భక్తి అదియేనా? మనకు తెలిసినది శాంతము గురించి. మనలో ప్రతియొక్కరు దానిని అనుభవించియున్నాము. అప్పుడప్పుడు హాస్యరీతిలో ఆయన ప్రశ్నలకు సమాధానమిచ్చేడి విషయము మనము చూసియున్నాము. ఆ హాస్యాన్ని సైతము మనము ఆస్వాదించియున్నాము. మనము తప్పకుండా గురువర్యుల ఆనందముతో ప్రభావితమవుతాము. "కేంద్రప్రాంతము" గురించి నేను "Path of Grace" పుస్తకములో వ్రాసియున్నాను. అందులో యీ స్థితిని గురించి ప్రస్తావించియున్నాను. ఇంకనూ ముందున్న ఉన్నత స్థాయిలో దాని హాస్యాంశము వస్తుంది. నాకిప్పటికి గుర్తుంది రాజశేఖర రెడ్డి తల్లి, పెద్దావిడ, మేము ఒకప్పుడు షాజహాన్‌పూర్ వెళ్ళినప్పుడు ఆమె గురువర్యులను తన బిడ్డలాగ చూడగలుగు సామర్థ్యముతో కూడిన ప్రయత్నము చేసినది. అచ్చట వాత్సల్య భావముండినది. భగవంతుని నీ కుమారునిగ భావించి భక్తిని ప్రదర్శించటము. నీవు అట్లు ఆలోచింపగలవా? ఒక తండ్రిగ నీవట్లు చేయగలవు. దానిని గురించి ఆలోచించునప్పుడు, ఆ బింబము నా కళ్ళముందు కదలాడుతున్నది. కొందరికి అలాంటి ఉద్వేగాలు కలుగుతుంటాయి. వారు దానిని అలా ప్రకటిస్తారు. అది వారి భక్తి పారవశ్యము. నీవు ఆయన్ని ఒక బిడ్డగా భావించినప్పుడు, నీవు ఆయనకు ఏమి యివ్వటానికి ప్రయత్నిస్తున్నావు? వాత్సల్య భావము, దీనిని యివ్వవలసిన వాడవు నీవే.

మాధుర్య భావమును గురించి మనలో చాలామందికి తెలుసు. శ్రీ కృష్ణభగవానుని విషయానికొస్తే ఎక్కువ సంఖ్యలో ఆయన శిష్యులు మరియు భక్తులు ఆ భావమును కలిగి యున్నారు. నీవు ఏ భావముతో ఆయన యెడల భక్తిని ప్రకటింపదలచావు? ఇది ఒక అనుభవపూర్వకమైన ప్రశ్న. మనము తొమ్మిది విధముల భక్తి భావములన్నింటిని కలిగి యుండగలమా? బహుశః వుండవచ్చునేమో, నీకే ఆ సామర్థ్యమున్నచో, అలాగే కానిమ్ము. ఐతే మనకు ఆ తొమ్మిది భావాలలో కనీసము ఒకటైనా వున్నదా? అదియే నా ప్రశ్న. ఆయన్నుండి విడిపోయామన్న విరహ వేదనను మనము అనుభూతి చెందుతున్నామా? మన మూలమునకు వెనుదిరుగుటకై ఆయన చెబుతున్నట్లు, మనలో ప్రతియొక్కడు ప్రయత్నిస్తున్నాడు. ఆ వ్యాసములో ఆయన అలాంటి వాక్యములను ఉపయోగించియున్నాడు. ఆ సందేశము ప్రతిరోజు

మనకు అందుతూనే యున్నది. ఐనను నీవు ఆ విరహమును అనుభూతిచెందితివా? నీవు నీ అస్థిత్వము ఆయనకు కడుదూరమున్నట్లు అనుభూతి చెందితివా? నీవు ఆయనను చేరుటకు ఆరాటపడుచున్నావా? కావున ఏ భక్తి గురించి మనము యిప్పుడు మాట్లాడుతున్నాము. ఇటువంటి ప్రతిదశగుండా నీవు పయనించాల్సివుంటుంది. ఇప్పుడు మీతో నేను పంచుకొంటున్న భావాలన్నీ మనము భక్తి గుండా పయనించేటప్పుడు కలిగెడి స్థాయిలుగా తెలియనగును. కావున మనము అదేదో వొక చిన్న కేంద్రమును గురించి మనము మాట్లాడుట లేదు. అది పైనుండి క్రిందివరకు విస్తరించియున్న విషయము. మన సమస్త అస్థిత్వమును ఆయనకు శరణాగతితో సమర్పింపవలెను. మనము లక్ష్యముపట్ల ప్రేమను పెంపొందించుకొనుటకు ప్రయత్నించినప్పుడు సాధారణముగ అచ్చట ఏమి జరుగును. నీ తాత్విక ఊహ ఏమైయున్నది? శూన్యత్వ పూజావిధానమును వొసగినప్పుడు గురువర్యులు ఒక పిచ్చి వాడై యుండెనని భావమా? అది నా సాధనకు ఎట్లు ఉపకరించగలదు? భగవంతుడు శూన్యము లేదా యేదోవొకటై యున్నపుడు, ఈ తాత్విక విధానమును ఆయన మనకేల యిచ్చెను? స్థాయిలు భిన్నములై యున్నాయి. భగవంతుని నైజము మరి మన నైజము బొత్తిగా భిన్న మైనవి అన్నట్లు మనము అనుకున్నయెడల, మొదట మనము గమనించవలసినదేమిటంటే, అచ్చట యోగము సాధ్యపడదు. యోగము సారూప్యముగల రెంటి నడుమ లేదా పూర్తి సమానతలు గల రెంటి నడుమ సాధ్యపడును. నేనొక సేవకుడైనప్పుడు, ఆయనొక ప్రభువు ఐనప్పుడు మరి ఆ సంబంధాన్ని కొనసాగింపవలసి వచ్చినప్పుడు అసలు యోగమెలా ఏర్పడుతుంది? కావున ద్వైతభక్తిలో ద్వైత సిద్ధాంతములో భగవంతుని సారూప్యమునకు వ్యతిరేక ప్రకృతితో లేదా భిన్న మైన ఒక నైజముతో ఆత్మను అనుసంధానము గావిస్తారు. చిత్ అన్నదాన్ని మినహాయిస్తే బ్రహ్మము మరియు ఆత్మల నడుమ ఎటువంటి సారూప్యతలు లేవు. ఎక్కువమంది భారతీయులు కలిగియుండు అతి ప్రధానమైన భావన యిది. భగవంతుడు చాలా గొప్పవాడు మరి నేను చాలా అల్పుడిని, మరి మా యిరువురి మధ్య ఎటువంటి సారూప్యత వుండజాలదు. అందుకనే యోగము సామాన్య ప్రజల అంగీకారము పొందియుండలేదు. ఎందుకంటే యోగము చెబుతుంది 'నేను ఆయనంతటి వాడవుతానని' ఒక సామాన్యుడికి అటువంటి ఆలోచనపట్ల ఆసక్తి లేదు. అద్వైతులు సైతము ద్వైతమును పాటిస్తున్నారు. ఈ దేశములో అందరూ ద్వైతమును మాత్రమే పాటిస్తున్నారు. కాని గురువర్యులు 'నేను గురువులను మాత్రమే తయారు చేస్తాను మరి శిష్యులను కాదు'. అని వారన్నప్పుడు వారు చెప్ప ప్రయత్నించినదేమనగా నీవు నేను ఒకటని, మరి ఒకటి కాగలమని. ఈ సిద్ధాంతము పట్ల నీవు ఏవిధముగ స్పందించెదవు? గురువర్యులను ఎన్నటికీ సమీపింప వీలుపడని ఒక వ్యక్తిగా మనము చూస్తున్నామా? ఎన్నటికీ ఆయనతో లయము చెందుటకు వీలు లేదనుకుంటున్నామా? ఈ ప్రశ్నను వేసుకొనుము. ఎందుచేతనంటే ఆయన మరి నేను నిజముగా వేరైనప్పుడు అచ్చట

ఎన్నటికీ యోగము సాధ్యపడదు. నేను ఆయనకు సేవకుడిగా మాత్రమే వుండగలను, నాకున్నదల్లా దాస్య భావమే, ఐతే వారి సాహిత్యమును నీవు చదివి యున్నట్లయితే ఆయన స్థాయిలను గురించి మాట్లాడుతున్నారు. తొలుత మనకు తెలియవచ్చునదేమిటంటే మన ప్రారంభ ఆవశ్యకతలుగా నేను ఆయనవాడను అను ఒక భావన మనకు వస్తుంది. దానిని తస్మైవహమ్ అని మనము అంటాము. నేను ఆయన వాడను నుండి ఆయన నావడన్న ఒక స్థాయికి మనము ఎదుగుతాము, ఈ సమూలమైన ఆలోచనలోని మార్పును గమనించండి, నేను ఆయన వాడను నుండి ఆయన నా వాడు తమ్ ఐ వాసవ్, ఆ పిమ్మట నేనే ఆయన అన్న స్థితికి వస్తాము. రాముడు, కృష్ణుడు మరియు నా మధ్య ఎటువంటి తేడా లేదు, నేనే కృష్ణుడిని, నేనే ఆ రాముడిని, నేనే బాబూజీని, భక్తి పథములో ఈ మూడు స్థాయిలగుండా మనము పయనిస్తాము, మౌలికముగా ఈ మూడింటి గుండా మనము వెళ్ళాల్సి వస్తుంది. పూజ్య బాబూజీ మహారాజ్ వీటి గురించిన సమాచారము మనకు అందివ్వలేదని చెప్పజాలము. ఆయన వీటన్నింటి గురించి వేరొకచోట ప్రస్తావించియున్నారు. ప్రత్యేక స్థలాలలో, సందర్భాలలో వీటిని పేర్కొని యున్నారు, మరి వాటిని మేము ఇక్కడ పొందుపరచటము సరియైన అవగాహన నిమిత్తమే, అదొక్కటే చాలదు, ఏలనన అది మనల్ని క్రియాశీలురను చేయదు.

సమతుల్యజీవనము రానేరదు, నేనే ఆయన అన్న అవగాహన ప్రపంచ దృష్టిలో నా స్థితిని ఇప్పుడున్న దానికన్నా గొప్పగా మెరుగుపరచజాలదు. ఆ దివ్యత్వములో మనము విడదీయరాని ఒక భాగమని మనము అనుభూతి చెందెదము, ఇది నేనే ఆయన అన్న భావనకు ఒక పరిపక్వత యనవచ్చును, నేనే ఆయన అన్నది ఏ అర్థములో? ఆయన అస్థిత్వములో ఒక భాగముగ నేనే ఆయన అన్నది సరియైవున్నది. నా చేయి యిది నారాయణ కాదు అని చెప్పజాలదు, దానికి స్వరము వుంటే అది నారాయణయని మాత్రమే చెప్పవలెను. అది నారాయణలోని ఏ భాగము, అప్పుడు చేతి భాగమని అది చెబుతుంది, కుడిచేతి భాగమో లేదా ఎడమ చేతి భాగమో, ఈ వ్రేలో లేదా ఆ వ్రేలో యని చెబుతుంది. ఆవిధముగా నేనే ఆయన అని మనము చెబుతున్నప్పుడు, నేను ఆయనలో ఒక భాగమన్న భావనవైపు వెడుతున్నాము. కావున యీ భాగమొత్తముల సంబంధమును గురించి మనము రెండవ గ్రంధిలో చెప్పుకున్నది మూడవ గ్రంధిలో ఒక అనుభవముగ మారి అదేవిధముగ ముందుకు సాగుతుంది. ఇవన్నీ మన ప్రయాణములో తటస్థపడెడి విభిన్న ఛాయలు మరియు దృక్పథాలు.

ఇప్పుడు పరస్పర ప్రశ్నోత్తరాల కార్యక్రమము కాకుండా ఇదంతయు నా అభ్యాసమేనని నేను చెబుతూ పోతుంటే, ఇక యింతటితో నేను ముగించవచ్చునని భావిస్తున్నాను. ఎందుచేతనంటే ఈ స్థాయిలన్నింటిని వ్యక్తిగతముగ నేను అధిగమించినవే, వీటిని

వ్రాతపూర్వకముగ పదిలము చేశాను, అందుకే వీటిని మీతో పంచుకోవాలనుకున్నాను. ఐతే ముఖ్యమైన సమస్య ఏమిటంటే మనము లక్ష్యముపట్ల సరియైన స్పష్టతను కలిగివున్నామా లేదా యన్నదే? మనము ముక్తిని గురించి మాట్లాడుతున్నామా లేదా మరో విషయాన్ని గురించిగాని మాట్లాడుతున్నామా అన్నదే. నేను ముక్తిని గురించి మాట్లాడెదను, దానితోపాటు సంపద, భౌతిక సంపద గురించి ఆలోచించెదను, ఈ రెండు భిన్న ధృవాలవంటివి. ఒకడేమో అర్థార్థి మరి రెండవ వ్యక్తి మోక్షార్థి. అటువంటప్పుడు రెండు రెక్కలతో ఎగరటమనే భావనను యెట్లు సమర్థించెదము. ఇది మనకు వచ్చెడి మరో ప్రశ్న. భౌతిక సంపదల పరిమితులను తెలిసి, అలాగే ఆ అనంతుని అపరిమితత్వము పట్ల కూడా అవగాహన కలిగి యుండి ఈ రెంటి మధ్య సమతూకాన్ని కలుగజేయుటకు మనము ప్రయత్నిస్తున్నాము. దీనిని గురించి సమతుల్య జీవనములో నేనిదివరకే చర్చించి యున్నాను. మనము కొనసాగించవలసిన సమతుల్యత అతి సున్నితమైనది. ఇప్పుడు ఆయనయే గురువర్యులని తెలిసికొని, ఆయనే మన మార్గదర్శియని, ఆయనే మనల్ని ఉన్నత చేతనా శిఖరాలకు గొంపోవు వ్యక్తియని తెలిసిన పిమ్మట దీనినే జ్ఞానోదయమనవలెనో కాదో మీరే చెప్పండి. దీనికి మీకు మీరే సమాధానమిచ్చుకొనవలెను. నాకు సరిగ్గా గుర్తున్నవరకు చాలాకాలం క్రితము నేను రామచంద్ర మిషన్‌లో వున్నప్పుడు, అప్పట్లో కుమారస్వామి గారు సెంటర్-ఇన్-చార్జిగా వుండేవారు.

అది 1974-75 వ సంవత్సరమనుకుంటా. నేనతనితో మాట్లాడు సందర్భమేర్పడినది. అప్పుడు మనము ఒక గురువర్యులను కనుగొన్నాము అని నేనన్నాను. ఆయన నన్ను యోగమార్గాన నడిపిస్తూ నాకు సత్‌తత్వ ప్రాప్తి స్థితిని ప్రసాదించిరి. నేనింక బాబూజీ మహారాజ్ గారిని తప్ప వేరొకరిని గుర్తించను అని అన్నాను. అది బసంత్ పంచమి పర్వదినము. లాలాజీ మహారాజ్ వారిలో లయమొందిన వొకే కారణము వలన నేను బాబూజీ మహారాజ్ గారిని తప్ప వేరెవ్వరిని ఎరుంగను. నాకు తెలిసిన ఏకైక వ్యక్తి ఒక్కరే, వారే బాబూజీ. ఈ నాప్రకటన తప్పుడు రీతిని అర్థము చేసుకొనబడి, తప్పుడు ప్రచారమునకు దారితీసినది. వారు చేసిన దానిని గురించి నేనిసుమంతయు సరకుగొనలేదు. అలాగే నీవేమనుకున్నా యీ విషయములో అది అప్రస్తుతము. ఐతే మౌలికముగ మనకున్నదల్లా కేవలము తదేక ధ్యాస. నాకు ముగ్గురున్నారు. మొదటి వారు మా గౌరవనీయులైన జనకులు, ఈ మార్గాన లేదా ఎవరి పరంపరలో మనమందరము వున్నామో మనల్ని నడిపిస్తున్న వ్యక్తి. రెండవ వారు ఆ విశిష్ట మూర్తిమత్వము లేదా పురుషోత్తముడు, మరి మూడవ వారు లాలాజీ. లాలాజీ సత్‌తత్వప్రాప్తిని పొందిన వ్యక్తియా కాదా అన్న ప్రశ్న నీవు వేయగలిగినప్పుడు, సత్‌తత్వప్రాప్తికి కొలబద్ద విశిష్ట మూర్తిమత్వముగా నీవు భావించినప్పుడు, లాలాజీ తప్పక కాదని చెప్పవచ్చును. ఎందుచేతనంటే ఆయన ఎన్నడూ ఒక విశిష్ట మూర్తిమత్వము కాదు, ఎన్నటికీ కాలేడు కూడ. బాబూజీ మహారాజ్ గారి

గురువర్యులుగా వారి పాత్ర మనందరికి సువిదితమే. తాను స్వయముగా వొక విశిష్ట మూర్తిమత్వము కాకున్నను ఆయనొక విశిష్టమూర్తిమత్వమును మలచిరి, ఆయనొక విశిష్టమూర్తిమత్వపు సృష్టికర్త. ఈ విషయములో మనకుండవలసిన ఒక సూక్ష్మ మైనది మరియు స్పష్టమైన అవగాహన యిది. వరదాచారి గారు జ్ఞానోదయము పొందిన వ్యక్తియేనా, కాదా? ఈ ప్రశ్న నీవు వేసినప్పుడు, నీవు కొన్ని నిర్దుష్ట లక్షణాలను చూపి ఆయన జ్ఞానోదయము పొందియుండుటకు ఒక విశిష్టమూర్తిమత్వముగా వుండి తీరాలని చెప్పినప్పుడు, ఆయన అది కాడు కనుక మనమును అలా లేము. ఈ విషయంలో శ్రీ రామచంద్రమిషన్ ప్రెసిడెంట్ గారికి సందిగ్ధత వున్నది. అచ్చటనున్నది కేవలము భక్తికి చెందిన సమస్య మాత్రమే. యోగపరిపూర్ణత యనునది కొన్ని వరుసక్రమముగల సోపానాలేయని మనము తెలుసుకొనవలెను. మనము ముందుకెళ్ళేకొలది జ్ఞానులవుతుంటాము. ప్రతిస్థాయి ఒక జ్ఞానోదయమే. ప్రతి గ్రంధి ఒక జ్ఞానోదయమే. అది దివ్యత్వమును గురించిన జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తుంది. ఇచ్చట ఈ నిర్దుష్ట భక్తి వస్తుంది. ఆ దివ్యత్వముపై భక్తిని కలిగి యుండటమే ఒక ఉన్నత శ్రేణికి చెందిన జ్ఞానోదయము. ఇది చివరిదశ కాదు. ఈ భక్తితో కూడి వుండటమన్నది తుదివరకు కొనసాగుతుంది. ఈ జ్ఞానము అనగా మనము ఆ దివ్యత్వమునకు భక్తులమన్నది తుదివరకు కొనసాగునది. నీవు కేంద్రప్రాంతమును చేరినను ఈ భావన కొనసాగుచునే యుండును. మనమెల్లప్పుడు ఆయన పట్ల భక్తిని కలిగి వుందుము. విభిన్నస్థాయిలలో మనము దీనిని ప్రకటిస్తాము, మనము ఏ స్థాయిలోనున్నప్పటికీ, భగవంతునిలో ఒక విడదీయరాని భాగముగ దీనిని మనము ప్రకటిస్తుంటాము. మనము చైతన్యములో మరింత గాఢమైన జ్ఞానమును ఆర్జించినప్పటికి ఆయనపట్ల మన సేవాభావము కొనసాగుతునే యుంటుంది. దివ్యత్వమునకు సేవ జరుగుతునే యుంటుంది, దివ్యత్వముపట్ల అంకిత భావము కొనసాగుతునే యుంటుంది. భక్తి ఎట్టి పరిస్థితులలోను మనము అధిగమించెడి స్థితి కాదు. నీవు భక్తికి అతీతముగ వెళ్ళవు, దయచేసి ఈ విషయాన్ని గమనించుము. చివరి స్థాయిలో భక్తిభావము వుండునని దశాదేశములలో ఆయన చెబుతారు. దీనిని గురించి మీరు ఎన్నోమార్లు యోచన చేసివుంటారు. భక్తి మూడవ బిందువుతో అనుసంధానమై యున్నప్పుడు, నేను దానిని చివరిగా ఏల పొందవలెను. ఎందుచేతనంటే అది మన స్వభావము కనుక. అది మానవ మర్యాద. దానిని మనము కొనసాగించక తప్పదు. మనము ఎన్నటికి పూర్తి దివ్యత్వము కాజాలము. అనేక స్థాయిలలో మనము ఆ దివ్యత్వమును మన ద్వారా పనిచేయుటకు అనుమతించెదము. ఇప్పుడు కూడా ఆ దైవము మన ద్వారా పని చేయుచున్నది. ఒక సాధారణ మనిషిలో సైతము ఆ దివ్యత్వమే పనిచేయుచున్నది. ఎవ్వరూ తమంతట తామే పనిచేయరు. అయితే ఆ దివ్యత్వమే మనద్వారా పనిచేయుచున్నదన్న అవగాహనయే యోగము లేదా సత్‌తత్వప్రాప్తి. ఆ దివ్యత్వము అందరిలోనూ పనిచేయుచున్నదన్న మాట వాస్తవము. ఆ దివ్యత్వము నాలో

పనిచేయుచున్నదన్నదే యోగము లేదా సత్‌తత్వప్రాప్తి. విషయము మీకు అవగతమైనదనుకుంటాను. ఏకాలంలోనూ ఈ లోకంలో ఎవడూ స్వతంత్రముగా పనిచేయుట లేదు. ప్రతియొక్కడు యీ ప్రేరేపణతోనే పనిచేయుచున్నాడు లేదా ఆ దివ్యత్వపు జీవశక్తితో పనిచేయుచున్నాడు. అందులకే మనము ఏ ప్రాణికి హింస కలిగించటమనే విషయాన్ని నమ్మము. ఎందుకంటే అది దైవత్వపు ప్రదర్శనము, దాని అర్థము ఏమైనను వుండుగాక, అది నాకు బోధపడకపోవచ్చును కూడ. అది నాకు చాలా భీతిని గొల్పునదై యుండవచ్చు కూడ. ఐతే దానిలో జోక్యము చేసుకోవటము, భగవంతునితో జోక్యము చేసుకొన్నట్లే. దానిని చెప్పినప్పుడు మనకు కలుగు జ్ఞానోదయమిదియే. అంతటా వున్నది ఆ దివ్యత్వమేనని. ఆ మొదటి వాక్యము మనము తెలుసుకొన్నట్లు అది తాత్వికమైన లేదా తర్కసంబంధమైన ప్రకటనము కాదు. అది అనుభవ భరితమైన సత్యము. నీకావిధముగ అనుభూతి కలుగుతుంది. దోమలను చంపుతానని ఎవరైనా చెబితే నీవు బాధపడతావు. అయినను నీవు దానిని యింకనూ చేసెదవు. ఐతే దయచేసి నీకు కలిగిన గాయమును గుర్తుంచుకొనుము. అప్పుడు నీవలన దోమకు కలిగిన గాయము నీకును బాధను కలిగిస్తుంది. అంటే నీ చేతనము పెరిగినది. దానిని ఎటువంటి దయలేక నీవు చంపినచో నీవు యింకనూ ఎదగనట్లేనని నేను భావిస్తాను. నీవు స్వార్థపరుడయ్యావు. చంపటమనేది యింకనూ వుండవచ్చు. ఒక తేలు నీచే చంపబడవచ్చు. ఆ తేలుకు కలిగిన గాయము నిన్ను కూడ బాధిస్తున్నది అన్న విషయాన్ని నేను అభినందిస్తాను. నీనుండి ఒక కంపనము, దాని కంపనమునకు అనుగుణముగ నున్నది, అది దాదాపు నేను చనిపోతున్నానని అంటున్నది. నీవును అటులనే అనుభూతి చెందెదవు. అందులకే మనము ఈ మార్గాన ఎదిగే కొద్ది ఒక అవాంఛనీయమైన తత్వాన్ని అచ్చట కనుగొంటాము. అదే దానిని ప్రక్కకు నెట్టు లేదా దానినుండి సూటిగా ముందు కెళ్ళు, ఎవరు ఎవరినీ చంప ప్రయత్నించ లేదని. అతడు చంపుతున్నప్పుడు అతనికి తెలుసు అతడు తనని బాధపెట్టుకుంటున్నాడని. ఈ సున్నితమైన భావన నాకు కలిగినది, నేను స్వానుభవముతో తెలుసుకుంటిని కావున మీకు చెబుతున్నాను. నీవు యింట్లోని ఎలుకను చంపబోతున్నావని అనుకుందాము, నా మనసు దానికి అంగీకరింపదు, నా హృదయము దానిని ఒప్పుకోదు. దీనికిగల కారణము నా చేతనము విస్తరించియుండుటయే. నీవు ఆయనపట్ల భక్తిని కలిగియున్నావని, అటులనే అదియును ఆయన పట్ల భక్తిని కలిగియున్నదని. అది దాని ధర్మమును నిర్వర్తిస్తున్నది. నా ధర్మమును నేను నిర్వర్తిస్తున్నాను. దాని ధర్మమును నిర్వర్తించుటలో ఆటంకపరచుటకు నేనెవరిని? అహింసలోని నిగూఢమైన అర్థమిదియే. దానిని మనము సాధించవలెనని భావింపుము. సాధ్యాసాధ్యాలు భిన్నముగ నుండవచ్చు. ఐనప్పటికి నీవు చంపవు, నీవు ఆ పని చేయుటకు వెరచెదవు. నీవు చంపిన ఆ ఎలుకకు ఒక సమాధిని కట్టెదవని నేను ఎదురుచూచుట లేదు. నీవు దానిని చంపినందులకై పశ్చాత్తాపపడిన చాలును. భగవంతుని పట్ల ఈ భక్తి పూర్వక అంకిత

భావము నీ అహింస గుణమునకు వన్నె తెస్తుంది. భగవద్భక్తిపట్ల నీకున్న శ్రద్ధ ఎంతయని కొలుచుటకు కొన్ని ప్రమాణాలు నీ మనసులో ఏర్పరచుకొనమని నీకు చెబుతున్నాను. నీవు భగవంతుని పట్ల భక్తి కలిగి యున్నావన్నప్పుడు నీలో అహింస లేక హింస యీ రెంటిలో ఏది ఎక్కువ యున్నది. అర్థము (ధనము) అది ఏమైయున్నప్పటికి, సాంఘిక జీవనమునకు ఒక ఆవశ్యకమై యున్నది, ఒక కుటుంబమును కలిగియుండి, వారి పోషణార్థమై, వారిపట్ల నీ ధర్మ నిర్వహణకై నీవు సంపాదిస్తున్న యెడల అది నీలోని మోక్షార్థిని బాధింపదు. నీలోని అర్థార్థి చాలినంత సమతూకము పొందియుండినచో నిన్ను, నీకుటుంబాన్ని పోషించుటకు వలయు ఆదాయముతో నీవు సంతృప్తి నొందెదవు. అది నీ మోక్ష కాంక్షను చలింపజేయదు. అంతేకాని నీవు హద్దుమీరి, రాబోవు కాలములో కలిగెడి యిబ్బందులను ఊహించుకుని పొదుపు గురించి మాట్లాడుతూ నీవు అర్థము వైపు మొగ్గు చూపినప్పుడు, ఆమేరకు భగవంతుని పట్ల నీ భక్తిశ్రద్ధలు బాధింపపడతాయి. అంటే నీవు భగవంతునిలో ఒక అంశమన్న విషయాన్ని అర్థము చేసుకోవటము లేదు. మరి దివ్యత్వము ఎన్నటికి నిన్ను వీడదు. నాచేయి ఎంత ఆత్మవిశ్వాసము కలిగియున్నదంటే దానిని నేను నరుకను. నా కాలు ఎంత ఆత్మ విశ్వాసము కలిగియున్నదంటే దానిని నేను నరుకను. భగవంతుని అంశాలుగా మనమేల అలా భావిస్తున్నాము. ఎందుకంటే మనము ఆ దివ్యత్వపు శరీరములోని భాగాలన్న అవగాహన మనకు లేకపోవటమే. అది అవగాహనాలేమి లేదా భక్తిలో పరిపక్వ శూన్యత కావచ్చును. నా ఈ భక్తిపట్లగల అభిప్రాయమును మీరు గ్రహించగలుగుతున్నారో లేదో నాకు తెలియటంలేదు. భక్తి పారవశ్యమన్నది, నేను ఆయనకు ఒక సేవకునిగా నున్నాను. ఆయన అస్థిత్వములోని ఒక భాగమునై భక్తి కలిగి వున్నాను. ఇది కూడా నీకు ప్రయోజనకారియే. చేయి కూడా ఉపయోగపడుతుంది. ప్రతి అవయవము నీకు సేవ చేస్తుంది, ప్రతి అంగము నీకు సేవ చేస్తుంది. మనము వీటిలో ఏ వొకదానినైనను బాధింపము. మనము వీటికి ఏ హాని జరుగనివ్వము. మనము తగు ముందు జాగ్రత్తను తీసుకుంటాము. నీవే నీ శరీరము పట్ల యింత శ్రద్ధ వహిస్తున్నప్పుడు భగవంతుడు తన శరీరముపట్ల ఎంతటి శ్రద్ధ వహించాల్సి వుంటుంది. ఆయన ఖచ్చితముగ నీవు తప్పక బాగుపడేటట్లు చూస్తాడు. ఈ దృఢవిశ్వాసము భక్తినుండి పుట్టుకొస్తుంది. ఇది ఒక తాత్విక వాదము కాదు. ఈ విషయంలో ఎంతటి తాత్విక వాదోపవాదాలు ఎవ్వరినీ నమ్మింపవు. ఐతే నీవే ఆ భక్తి స్థాయికి ఎదిగినప్పుడు నీకది తప్పక సిద్ధిస్తుంది. ఇక కామార్థి విషయము చాలా అధ్వాన్నమైనది. కామము అవసరమైనదే, అది కొన్ని అవసరాలు, మౌలిక అవసరాలకు పరిమితమై యున్నది. మరి సంతానము అచ్చట నున్నప్పుడు, కామోద్రేకములను రెచ్చగొట్టడములో అర్థములేదు. అయితే అవి అక్కడ వుంటాయి, నీవేమి చేయ జాలవు ఎందుకంటే నీవు ఒక పశువు కనుక. నీవుగా ఆ యిచ్ఛను ఎగద్రోయటాన్ని నేను ఖండిస్తున్నాను. అందుకే దయచేసి టీవీలు, సినిమాలు చూడవద్దని, చెడు పుస్తకములను చదవవద్దని చెబుతుంటాను. దేనినైతే అదుపులో వుంచగలవో

దానినే నీవు రెచ్చగొడుతున్నావు. దీనిని 'A', 'B' బిందువులపై ఫలవంతముగా ధ్యానించుటవలన అవి అధీనములోనికి వస్తాయి. అంతేకాని వాటిలో నీవు నిమగ్నమైనప్పుడు కాదు. నీవు వాటిపట్ల ఉదాసీనత వహించినప్పుడే. మరి ఈ విషయంలో అలాంటి నిర్ణయము తీసుకొన్నప్పుడే అది సాధ్యపడుతుంది. అప్పుడు మాత్రమే 'A' మరియు 'B' బిందువులపై ధ్యానము క్రమంగా ఫలవంతమవుతుంది. అంతేకాని 'A' మరియు 'B' ఎలాంటి అద్భుతాలు తీసుకొనివచ్చు సామర్థ్యము లేదు. చాలామంది అభ్యాసులు దీనిని గురించే నాకు వ్రాస్తుంటారు. ఏ అద్భుతము సాధ్యపడదు. నీవు ఒక దృఢ నిర్ణయము తీసుకోవాలి. ధర్మము విషయానికొస్తే చాలా కలవరపాటు కలిగించుతుంది. ఎందుచేతనంటే ధర్మము మోక్షములాగా అగుపిస్తుంది కనుక. మన సాంప్రదాయము చెబుతుంది 'నీవు ధర్మ కార్యాలు యెంతగా చేస్తావో నీవు అంత మోక్షానికి అర్హుడవుతావని.' నీకు మోక్షము లభిస్తుంది. అయితే ఈ రెంటి నడుమ ఎలాంటి సంబంధము లేదు. ఆ సందర్భముగనే నేను సహజ సేవా సంస్థాన్ గురించి ఆలోచించటము ప్రారంభించాను. నీవు ధర్మము చేయవలసినదే. దానిని నా గురువర్యుల పేర చేయనిండు. మీరు ఎవరి పేరనైనను చేయవచ్చును. అటువంటప్పుడు గురువర్యుల పేరున దానిని చేయుటలో గల పరమార్థమేమి? అది ఆయన పట్లగల నా భక్తిని నొక్కివక్కాణించుటకే. నన్ను నేను దృఢపరచుకొనుటకు ప్రయత్నిస్తున్నాను. ఈ రెండు లౌకికమైన సంస్థల ఆలోచనాసరళి మీకు అర్థమైందనుకుంటున్నాను. మీకిదివరకే నేను చెప్పియున్నట్లు మా తండ్రి గారి వ్యాసములో ఆయన ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, సాంఘిక సంక్షేమ కార్యాలకు విరుద్ధముగ మాట్లాడియున్నారు. ఎందుచేతనంటే ఆయన మనసులో రామకృష్ణామిషన్ నాటుకుపోయి వున్నది కనుక. నేను నా మనసులో రామకృష్ణామిషన్‌ను వుంచుకొనలేదు. నేను భక్తిని నా మనస్సులో వుంచుకొనియున్నాను. నేను యేదో సేవచేయటము లేదు. ఈ చర్యద్వారా నా భక్తి యొక్క నాణ్యతను పెంచుకో ప్రయత్నిస్తున్నాను. నేను నా మూలమును దృఢపరుచుకోదలిచాను, తద్వారా అది నా ధర్మమును తీవ్రతరముగ చేయనిస్తుంది, లేకున్నచో నా సమయాన్ని నేను వృధా చేస్తున్నట్లే. దేవాలయాలకు వెళ్ళటము ఒక ధర్మ కార్యము కాదా, కొన్ని నదులలో స్నానమాడి పూజించుటకై వెళ్ళటము ఒక ధర్మ కార్యము కాదా, ఈ వ్రతము, ఆ వ్రతము చేయటము ధర్మ కార్యము కాదా. ఇవన్నీ మనస్సులో మెదులుతాయి. క్లుప్తంగా మీకు నేను సమాధానమిచ్చున దేమిటంటే నేను వాటిని పట్టించుకోనని, యిదియే నేను చేయబోవు సిసలైన పనియని. మనము ధర్మ కార్యము చేస్తాము అంటే ధర్మ కార్యమే చేస్తాము. అది మోక్ష కార్యమెంత మాత్రము కాదు. పరులకు సహాయము చేయటము మన విద్యుక్త ధర్మము, కనుక అలాగే సహాయము చేద్దాము. కావున ఈ విధంగానే మనము యీ మూడు పురుషార్థాలను సమన్వయ పరచగలము. లేకున్నచో సన్యాసము పుచ్చుకోవటము తప్ప వేరు గత్యంతరము లేదు. మరో మార్గమేమిటంటే నేను అర్థార్థి కానని, కావున నేను ఏ పని చేయనని

చెప్పటమన్నమాట. నేనొక కామర్థిని కాను, నాకు ఏ సంసారము వద్దు. ఇక ధర్మానికొస్తే ఒకడు ఎప్పటికీ చెప్పునదేమిటంటే అతనికి సంఘముతో ఎలాంటి సంబంధము లేదని. మరి ఒక మోక్షార్థి విషయానికొస్తే అతడు అడవికి వెళ్ళగలడు. ఇదియే ప్రతి సన్యాసి చేస్తూవచ్చినది. మనము అలా చేయటానికి సిద్ధముగా లేము ఎందుచేతనంటే గృహస్థాశ్రమములోనే మనకన్నీ లభించగలవని పూజ్య బాబూజీ గారు చెప్పారు. కావున అవి ఒక భక్తుని నాలుగు పురుషార్థాలు. ఎందుకంటే ప్రజలు గుళ్ళూగోపురాలకు ఒక విచిత్రమైన రీతిలో వెళ్తుంటారు, వారు వివాహాలకై దేవాలయాలకు వెళ్తారు, కావున ఇలాంటి లక్ష్యాలను గుర్తించి వారికి సదుపాయాలను సమకూరుస్తున్నాయి. అంతకన్నా వారేమి చెప్పగలరు. నీవు అక్కడికి వెళ్ళి నీక్కావలసినది ఏదైన అడుగు, అది అతడు యిచ్చును. అతడు యిస్తాడా, యివ్వడా అన్న విషయము మనకు చర్చనీయాంశము కాదు. ఉద్దేశమదియే. అదే మన విషయానికొస్తే మనము మోక్షము మరియు దానికి పైనున్న స్థితులను కోరుతున్నాము. మరి వాటన్నింటిని ఒక లక్ష్యముగ వుంచుకున్నాము, లక్ష్యధ్యాసతో వున్నాము. ఈ లక్ష్యధ్యాస భక్తి లేనిదే అసాధ్యము. మనకు లక్ష్యశుద్ధి వుండాలన్న ధ్యేయముతోనే మనము మన శిక్షణా కార్యక్రమాన్ని ఎల్లప్పుడూ ప్రారంభిస్తాము. అటువంటి లక్ష్యశుద్ధి, లక్ష్య స్పష్టత కేవలము భక్తినుండి మాత్రమే అంకురించగలదు. మేధోపరంగా మనము దానిని అభినందించగలము. కాని దానిని నీవు ఆచరింపవు. ఒక లక్ష్యాన్ని అభినందించటము ఆ లక్ష్యాన్ని సొంతము చేసుకోవటము కన్న భిన్న మైనది. ఆ లక్ష్యాన్ని నీవు గ్రహించవలసి వస్తే నీవు తప్పక దీనిని అనుభూతి చెంది తీరాలి. కావున మనము మోక్షార్థులు కావాలి. మనకు యిది స్పష్టమేనా. నీ భక్తి దానివైపు మొగ్గియున్నయెడల గురువర్యులు నీకు సరియైన వారే. లేనిచో ఏ కొండజాతి దేవుడు యింతకన్న మెరుగే. ఇంకా ఏ వ్రతమైనా మెరుగే. మరి ప్రజలు ఎక్కడ సంకోచిస్తున్నారు? దీనిని మనము పరిశీలించినచో, నీవు ఒకరి సహాయమునకై తీవ్రముగా పరితపిస్తున్నప్పుడు, నీకు సహాయము చేయుటకై ఎవ్వరూ ముందుకు రానప్పుడు, నీ పరిస్థితి వాస్తవముగ అధ్వాన్నమవుతుండగా, ఆతురతతో ఒకరి సహాయమునకై ఎదురు చూస్తుండగా అలాంటప్పుడు నీవు ఫలాన గుడికి వెళ్ళు నీకు ఉపశమనము కలుగుతుంది, ఫలానా బాబా దగ్గరికి వెళ్ళు, ఆయన నీకు సహాయము చేయుటకు సిద్ధముగ నున్నారు అని యెవ్వ రైన చెప్పినప్పుడు నీవు వెడతావు. అంటే, గురువర్యులపట్ల వుండవలసినంత భక్తి లేదు మరి లక్ష్యశుద్ధి లేదు కనుక నీవు వేర్వేరు విషయాలకు ఆకర్షితుడవుతున్నావు. నీవు అటుల కాకపోయినను, నీ యింట్లోని తతిమ్మా సభ్యులు ఆకర్షితులయ్యేదరు. నీవు ఆకర్షితుడు కానక్కర్లేదు, నీ భార్యో లేదా అమ్మో లేదా నాన్నో లేదా పిల్లలో నీకు సూచనలిస్తారు. నీవు ఈ గుడికి ఎందుకు వెళ్ళకూడదు, నీవు అక్కడికి ఎందుకు వెళ్ళకూడదు, నీవా పనిని ఏల చేయరాదు. నీవు వాటిలో దేనిని చేయొద్దని నేను అనటములేదు. నీ పరిమితులను తెలుసుకొనుము. నీవు వారిని కేవలము తృప్తి పరస్తున్నావా, నీ లక్ష్యముపట్ల

నీవు నిక్కచ్చిగా నున్నావా మరి నీ లక్ష్యమును తెలిసియుండి కూడా నీవీ పనిని చేయుచున్నావా. మూర్ఖపట్టుదలకు పోవటము వలన ఏ ప్రయోజనము లేదు. చాలామంది భక్తిని మూర్ఖ పట్టుదలతో పోల్చుకొని తికమక పడతారు. అది మూర్ఖపట్టుదల కాదు. లక్ష్యముపట్ల స్పష్టత వున్నప్పుడు, దానిని ప్రాప్తించుకొనుటకు సాధనములు కూడ వున్నాయని తెలిసినప్పుడు మరి గమ్యముపట్ల తదేక ధ్యాస వున్నప్పుడు అది యితరులకు ఒక ఉన్మాదముగ అనిపించవచ్చును, కాని నిజానికి అది కేవలము ఒక దృఢనిర్ణయమే. ఒక మహత్తర కారణము పట్ల అంకిత భావము కలిగి వుండటానికి నీకు ఎంతో దృఢ నిశ్చయము కావలసి యున్నది. నీవు ఎన్నో విషయాలకు 'లేదు' 'కాదు' అని చెప్పాల్సి వుంటుంది.

మనము 'లేదని' చెబుతున్నప్పుడు మనము కఠినముగా నుండపన్లేదు. వాస్తవముగ మన సంస్థలో రాజసిక భక్తి విధానమునుండి బయటపడవలెనని కోరుకొనుచున్నాము. ఎందుచేతనంటే రాజసిక భక్తిలో ఫోటోలు, ప్రసాదాలు మున్నగునవన్నీ చోటుచేసుకుంటాయి. పవిత్రమైన, సరళమైన నీ హృదయాన్ని ఆ దైవమునకు సమర్పించుటయే సాత్విక భక్తి. సాత్విక భక్తి విధానమువైపు పయనించటము అంత సులువైన పని యేమి కాదు. ముఖ్యముగా యీ దేశములో నీవు అనేక పూజా పద్ధతులకు అలవాటుపడి యుండుటవలన, అనేక భగవద్రూపాలకు పూజ చేయుటవలన నీ యింట్లో ఎందరో అలా చేయుటవలన, బహుశః నీ యిరుగుపొరుగు వారు అట్లు చేయుటవలన సాత్విక భక్తి విధానమును అనుసరించుట అంత సులభమైన పనికాదు. ఈ విషయములో ఎవ్వరితోను ఘర్షణపడి లాభములేదు. వారు తామసిక లేక రాజసిక పూజా విధానాలకు అలవాటు పడియుండుట వలన వారికి యిది రుచించదు. లక్ష్యశుద్ధి వున్నప్పుడే సాత్విక భక్తి సాధ్యపడుతుంది. ఆ పురుషోత్తముని చేరటానికి లక్ష్యశుద్ధి కలిగినప్పుడే లేదా మోక్షమును కాంక్షించినప్పుడే నీవు సాత్వికుడవు అవుతావు. నీకున్న మిగతా అన్ని రకాల లక్ష్యాలు, అర్థార్థి, కామార్థి, ధర్మార్థి యీ లక్ష్యాలున్నచో, అప్పుడు తామసిక లేదా రాజసిక గుణములు అచ్చట తప్పక వుండి తీరాలి. అచ్చట ఎటువంటి సాత్విక లక్షణము వుండటానికి వీలు లేదు. ఈ స్థాయిలలో సాత్విక పూజ సాధ్యపడదు, నీవు వట్టిస్తోత్రముతో పొగడ్తనైనా చేయాలి లేదా వినోదము కొరకైనా పూజించాలి. భగవంతుడు సంగీతమును వింటాడో లేదో నాకు తెలియదు, ఐతే నీవు ఏ దేవాలయానికి వెళ్ళినప్పటికి నీకు సంగీతము మాత్రమే వినిపిస్తుంది. దాని ఉద్దేశము భగవంతుని సంతోషపరచుటకే. ఐతే అది రాజసికము. మనము ఆయన్ని తనస్థాయినుండి క్రిందికి రమ్మంటున్నాము, ఈ సంగీతాన్నాస్వాదించటానికి ఆయన్ని ఒక నిమ్నస్థాయికి మనము రమ్మంటున్నాము.

నేను ఇచ్చట శబరి భక్తిని ప్రశ్నించటము లేదు, ఆమెకు రామునిపట్ల ఎటువంటి భక్తి

యుండెనో మరి దానిని రాముడు ఏవిధముగ స్వీకరించి యుండినప్పటికి అది మాత్రము తామసిక భక్తియే. భగవంతుని ఎంగిలి (ఉచ్ఛిష్ఠము)తో సంతృప్తి పరచుటకు ప్రయత్నించటమనునది ఖచ్చితముగా సాత్విక భక్తి కానేరదు. దానిని భగవంతుడు వాత్సల్యముతో స్వీకరించెనన్నది వేరే విషయము. దానితో మనకు పన్లేదు, ఆ వాత్సల్యము కూడా తామసికమైనదన్న విషయాన్ని నీవు అర్థము చేసుకోవాలి. తల్లిప్రేమ సాత్వికముగ వుండపన్లేదు. ఆ మాటకొస్తే తండ్రి ప్రేమకూడా అలా వుండనక్కర్లేదు. ఎన్నోమార్లు అది తామసికమో లేదా రాజసికముగనో వుంటున్నది. పిల్లలపట్ల పెద్దలు చూపెడి ప్రేమ పలుమార్లు కఠినమైన పద్ధతులలో ప్రదర్శింపబడుతున్నది. అంటే అది రాజసికము మాత్రమే. నీవు వారిని తిట్టవచ్చును లేదా కొట్టవచ్చును లేదా మరోలా చేయవచ్చును, యివన్నీ రాజసికమే. నీవు భగవంతుని కూడా నిందింపగలవు. అదే శిశుపాలుడు చేసినది. అయినను అతనికి ఒక ప్రత్యేక పద్ధతిలో వధింపబడటమనే ప్రతిఫలము లభించుట వేరే విషయము.

పూజ్య బాబూజీ గారు అన్నట్లు భక్తి అనునది యీ భావాలేవీ కావు. అది దైవముతో ఒక సాహచర్యము. మనము మాట్లాడెడి స్నేహము గురించి చెప్పాలంటే మనము ఆయన్ని యేవిధంగానైనా ఉపయోగించుకొనగలమని. లేదు, అది ఒక సహచర్యము. భగవంతునితోటి యే సహచర్యమైనను భక్తి యనబడును. అందుకే అచ్చట తొమ్మిది భక్తిభావాలు ఆమోదించబడినాయి. నీవు యే భావమును కలిగియున్నావు, ఎందుచేతనంటే మనలో యే వొక్కరూ ఆ తొమ్మిది భావాలను కలిగియుండలేదు. మనలో ఏవొక్కరూ ఆ త్రిగుణములన్నింటిని, అనగా సత్వ, రజో, తమో గుణములను ఒకేసారి కలిగియుండలేరు. కాని వొక్క గుణము ప్రాధాన్యము వహిస్తుంది. తతిమ్మా రెండు అణిగి వుంటాయి. భక్తికి సంబంధించిన ఈ అంశాలన్నీ నీవెరింగినచో నీ ధ్యానములను నీవు యింకనూ బాగుగ అర్థము చేసుకోగలవు.

నీవు ధ్యానావస్థలో నున్నప్పుడు, నీకు పెక్కు సంఖ్యలో ఆలోచనలు వస్తుంటాయి. అవి వివిధ రంగాలకు సంబంధించినవి నీ వశము కానివి. అయితే ఈ నాలుగు లక్ష్యాలకు (పురుషార్థాలకు) సంబంధించినవి మాత్రమే, అది అర్థము కావచ్చు, కామము కావచ్చు, ధర్మము లేదా మోక్షము కావచ్చు. ఆ నాలుగు అచ్చట వున్నవి. ధ్యాన కాలమున అవి ఒక దానితోనొకటి క్రీడించుచున్నవి. అవి ఒక దాని తర్వాత మరొకటి చొప్పున వస్తున్నాయి. అప్పుడు నీకు యే భావము దైవముపట్ల సహకరించగలదు? నీవు అనుసరించవలసిన భక్తి యేది? ఆ తొమ్మిదింటినుండి నీవు యే భావమును ప్రదర్శించెదవు? ఏదీ పనిచేయదు. నారద భక్తి సూత్రాలలో పేర్కొన్న నవ విధ భక్తి బావాలేవీ సహకరింపవు. ఏది సహకరిస్తుంది? సంపూర్ణ శరణాగతియే మనము కలిగి వుండవలసినది. భగవంతుడు యేది నిర్దేశించెనో అటులనే జరుగనీయన్న నివేదనా భావము

వొక్కటే కలిగియుండవలెను. ఆవిధంగానే భక్తి శరణాగతికి పరిణతి చెందుతుంది. భక్తికి సంబంధించిన ఈ అంశాలన్నీ అచ్చట వున్నాయి. అయినను మనము ముందుకు కదలలేక పోతున్నాము. మోక్షమునే నేను కోరునది అయినను ఈ మూడు పురుషార్థాలు నన్ను వేధించుచున్నవి. అనేక కారణాల వల్ల అవి నన్ను విసిగిస్తున్నాయి. నాకు లక్ష్యముపట్ల స్పష్టత వున్నది. నేను కేవలము పరతత్వము వైపునకు వెళ్ళగోరుతాను. నాకు ముక్తి కావాలి. ఐనను ఈ పురుషార్థాలు అచ్చట వున్నాయి. మనము యేమి చేయాలి. ఇచ్చటనే మన ప్రార్థన అర్థవంతమగునట్లు మనకు తెలుస్తుంది. "నేనింకనూ నా కోర్కెలకు ఒక బానిసనై యున్నాను", యెందుచేతనంటే అర్థార్థి, ధర్మార్థి మరియు కామార్థి యివన్నీ కోరికలే. న్యాయంగానో లేదా అన్యాయంగానో వాటిని నేను పొందగోరెదను. అవి నాకు అవసరమో కాదో నేను వాటిని కోరుతున్నాను. నేను ఒక బానిసగా మారుతున్నట్లున్నది, నీవే నన్ను రక్షింపగలవు. కావున ఆ దాస్య భావమే, అద్వైతులు చెప్పు చందాన, మనల్ని గట్టెంకించగలదు. ఇప్పటిదాకా ప్రస్తావిస్తూ వచ్చిన నవ విధ భక్తి భావాలు మనకు సహకరించవు.

మనము ఆ దైవమును శాంతమూర్తిగ కూడ అనుభూతి చెందెదము, వొప్పుకుంటాను. ఈ ఆలోచనలన్నీ అచ్చట వున్నప్పటికిని, బాబూజీ గారు చెబుతారు, "వాటిని సరకు చేయకుము". నేను ఎందుకు అలా చేయాలి? ఎందుచేతనంటే నేను వారిని నా భగవానునిగ స్వీకరించాను కనుక మరి వేరే కారణమేదియును లేదు. నేను నన్ను వారికి సమర్పించుకున్నాను మరి ఆయన గురువర్యులు. ఆయన చింతిల్లవలదని అంటున్నారు కనుక చింతించకుము. దీనికి మించి గోచరమగు కారణమేదియును లేదు. అది నీ గురువర్యుల పట్ల నీకున్న భక్తిపై స్థిరపడుతుంది. చేతనాపూర్వకముగ నీవు ఎంతమేరకు ఆయనపై ఆధారపడి యున్నావు? అలాగే ఎంతమేరకు ఎరుకలేని స్థితిలో ఆయనపై నీవు ఆధారపడి యున్నావు? లేదా మాటవరసకే నీవు ఆయనపై ఎంతవరకు ఆధారపడి యున్నావు? అది కేవలము మాటమాత్రమే. నీవు యేదియు దాని మూలముగ తెలుపుట లేదు. నీవు చెప్పునది నీవు చేసి యుండినయెడల, ఆ ఫలానా సూచన పనిచేసి తీరాలి. ఐతే మనలో చాలామంది చెప్పునది చేసియుండలేదు. అది కనీసము మనస్థాయి. నేను యింతక్రితము అనుభవించిన ఆవేదనలను మీతో పంచుకొంటున్నాను. ఈ స్థాయిలగుండా పయనించి మనమిక్కడిదాకా వచ్చాము. అది అంత సులువైనది కాదు.

భక్తి అనుకున్నంత సులభమైనది కాదు, గురువర్యులను స్వీకరించటము అంత తేలికైన విషయము కాదు. ప్రతి ఒకరు ఆయనే గురువర్యులని చెబుతారు మరి వారు అయనపై ఆధారపడియున్నామని కూడా అంటారు, నిజంగా అతను ఆధారపడియున్నాడా యనునది ప్రశ్న? నీకు కర్తృత్వభావము (నేనే అంతా చేయుచున్నాను), జ్ఞాతృత్వభావము (నాకంతా

తెలియును) అచ్చట వున్నప్పుడు, నీవు అటులనే వుందువు. అది ఆధ్యాత్మిక విద్యకు సంబంధించిన మొదటి ఐదు విషయాలను గుర్తు తెస్తుంది. జ్ఞాన, కర్మలను వదిలిపెట్టాలి. కర్తృత్వ భావము కర్మమునకు, జ్ఞాతృత్వ భావము జ్ఞానమునకు వర్తిస్తాయి. ఐతే మనకు వుండవలసిన భావన భక్తియే. నీకర్థమైందనుకుంటాను! అందుకే ఆధ్యాత్మిక విద్యలోని మూడు విషయాలతో నేను ప్రారంభించాను. ఆధ్యాత్మిక విద్య కర్మము ద్వారా అనగా పనిచేయుట ద్వారా గ్రహించబడగలదు. నేను వీటిని ఏ ఆసక్తికరమైన చర్యలు లేకనే చేయుటకు ప్రయత్నించెదను, ఆసక్తి అనాసక్తి మున్నగునవి అంతా పోవాలి. అనాసక్తి (ఫలాపేక్ష లేని)తో చేసెడి పనులు మనకు సంస్కారములు ఏర్పడక వుండుటలో సహకరిస్తాయి. దానికి విశేషమైన తర్కము కలదు. ఇక భక్తి విషయానికొస్తే, నీవు కర్తవన్న భావము నీకు కలిగినంతనే, సమస్య మొదలవుతుంది. అందుకే వారు చెబుతారు “ఆ పనిని చేయగల వాడను నేను”. అది ఒక ఫలాపేక్ష లేని కర్మ కాదు, అది దైవములో ఒక భాగమవటానికి ప్రయత్నిస్తున్నది, అలాగే మనల్ని కూడ దైవములో ఒక భాగము కావటానికి అనుమతిస్తున్నది. అది దైవము కొరకు, దైవ ఉద్దేశము కొరకు, దైవము తానిచ్ఛ వచ్చినట్లు చేసుకోటానికై. కావున యిచ్చట ఎలాంటి నిష్కామ కర్మము లేదు. గురువర్యులు నా ద్వారా పనిచేయునప్పుడు అచ్చట ఎటువంటి నిష్కామ కర్మము లేదన్న విషయాన్ని దయచేసి అర్థము చేసికొనుడు. నిష్కామ కర్మ అనునది ఒకవిధమైన కర్మన్న మాట. అందులో నాకు ఫలితముతో పని లేదు, ఐనను నా పనిని నేను చేస్తాను అది నాకెంతో మేలు చేస్తుంది. ఐతే గురువర్యులనెడి ఒక వ్యక్తి నీద్వారా కర్మలనాచరించుచున్నారని తెలిసినప్పుడు నీవు ఆయనలో ఒక భాగము అయ్యావు. నీవు ఆయనలో ఒక అంగమయ్యావు, నీవు ఆయనలో ఒక అంశము అయ్యావు. అదివొక విశేష తర్కముగ అచ్చట నున్నది. అదియే ఈ అలోచనలను నియంత్రించుటలో నీకు తోడ్పడుతున్నది. అందులకే ఆయన ఒక వింత సమాధానమిస్తారు. అదియును ఒక పాశ్చాత్యునితో సంభాషించునప్పుడు, ఆయన చెబుతారు, “వాటిని నా భావనలనుకో”. ఇది చెప్పునప్పుడు వారు ఆచితూచి మరీ చెప్పారు. ఆయన ఎవ్వరితో మాట్లాడుతుండిరని మనము తెలుసుకోవాలి. క్రమశిక్షణలేని వారితో వారట్లు మాట్లాడిరి. అందులకే ఆ పద్ధతి కొంత కాలము పనిచేస్తుందని వారు చెప్పియుండిరి. దీనిని శాశ్వతముగా ప్రయత్నింపరాదు. నీవు భక్తియనెడి స్థాయిలో నెలకొని యీ పద్ధతిని అనుసరించినయెడల, సహజంగానే నీవు ఒక సమత్వస్థితి పొందెదవని నీకు తెలుస్తుంది. నీ ధ్యానం పరిపక్వత పొందుతుంది, అలాగే నీ శరణాగతి సైతము పరిపక్వత నొందుతుంది.

కావున లక్ష్యము పట్ల స్పష్టత అన్న విషయాన్ని గురించి మనము చర్చిస్తూ వచ్చినదంతా చాలా క్లిష్టమైనటువంటి లక్ష్యస్పష్టతను గురించియని తెలియనగును. దీనిని గురించి మనము ఇదివరకు ఇంత తీవ్రతరముగ యేల చర్చించి యుండలేదనిన మనము అప్పుడు తాజాగా శిక్షణకై

వచ్చిన వారితో మాట్లాడుతుంటిమి. వారితో వీటన్నింటి గురించి చర్చించటములో అర్థము లేదు. ఐతే సమస్య ఏమిటనగా నీవు ఏమై యున్నావు? మొట్టమొదట నిన్ను నీవు విశ్లేషించుకో, నీవు యేమి కోరుచున్నావు, మరి నీవు యే కోవకు చెందిన మనిషివి? పురుషార్థ విభాగము, గుణకర్మ విభాగము, ఈ రెంటిపట్ల ఒక పరిపూర్ణమైన స్పష్టత ఆవశ్యకము. అందుకే గీత ఎందరో సాధకులకు ఉపయుక్తమైనదిగా నీవు కనుగొంటివి. ఐతే ఈ విశ్లేషణము నీకై నీవు చేయదగినది. నీకు ఆహారము అవసరమున్నను లేకపోయినను, యిష్టమున్నను లేకపోయినను ఆచార పద్ధతిలో, వొక నిర్ణీత సమయములో తీసుకొనుట వొక పద్ధతి. నీకు కావలసినప్పుడు మాత్రమే భుజించుట వివేకమైన పద్ధతి. నీవు ఏదైయున్నావు? నేను మీరు యోచించుటకు కావలసినంత మీ ముందుంచి యున్నాను. ఆలోచించవలసినది యిక మీ పని.

* * *

(బోధయంతి పరస్పరం సంపుటి - III లోని 'DEVOTION' అన్న అయిదవ అధ్యాయమునకు యిది స్వేచ్ఛాను వాదము. సాధకులు మరింత అవగాహనకు పూజ్య శ్రీ కె.సి.నారాయణ గారి ఆంగ్ల ప్రసంగమును ప్రామాణికముగా తీసుకొనవలసినదిగా మనవి చేయుచున్నాను. - బి.వి.రమణ)